క్లుప్తంగా

ఈ క్రాప్ బుకింగ్ పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి కె.చందన

ఆత్మకూరు: మండలంలో మిర్చి పంట ఈ క్రాప్ బుకింగ్‌ను శనివారం ఉద్యానశాఖ అధికారిణి కె.చందన పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్‌కి ఇంకా కొద్ది రోజుల సమయం మాత్రమే ఉండడంతో రైతులు ఉద్యాన పంటలను వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. రాయితీ, పంట నష్ట పరిహారం తదితర ప్రోత్సాహకాలకు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. ఉద్యాన పంటలు సాగు చేయాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. తైవాన్ స్ప్రేయర్లు రాయితీలో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న అబ్దుల్లా

మిడుతూరు: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో ఇళ్లకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్ మరమ్మతులకు గురి కావడంతో ఎల్‌టీ తీసుకొని ఫీల్డ్ అసిస్టెంట్ అబ్దుల్లా మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సప్‌లై కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు హాస్పిటల్‌కు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన ఆటో, రేషన్ బియ్యం బస్తాలు

మహానంది: బోయిలకుంట్ల మెట్ట వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. డోన్, గోస్పాడు గ్రామాలకు చెందిన యానాం నాగేష్, లక్ష్మీదేవి.. గాజులపల్లె, చుట్టుపక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యం సేకరించి ఆటోలో తరలిస్తున్నారన్న సమాచారంతో నిఘా ఉంచి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 12 బస్తాల్లో ఉన్న 600 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై చెన్నైకి చెందిన మైత్రీ సెంటర్ ఫర్ ఆర్ట్స్ వారి సంప్రదాయ నృత్యం అలరించింది. కార్యక్రమంలో గణపతిం, గురు నవనీతం, భ్రమరాంబాష్టకం, తాండవనృత్యకరి, భో శంభో, చక్కని మా శివయ్య గీతాలకు అరుణ్‌కుమార్, గాయత్రి ఆనంద్, అభినయ, యువశ్రీ, తనూశ్రీ తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం







హారికబాయి శరణ్య నూర్‌మహమ్మద్

ఆత్మకూరు: మెడికల్ సీట్లు సాధించిన స్థానిక జి.పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం స్కూల్ పూర్వ విద్యార్థులు హారికబాయి, శరణ్య, నూర్‌మహమ్మద్‌లను శనివారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో డైరెక్టర్ గోపిశెట్టి సాయిప్రణీత్ మాట్లాడుతూ మెడికల్ సీట్లు సాధించిన వీరిని మిగతా విద్యార్థులు స్ఫూర్తి గా తీసుకుని కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకుని గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సభలో హెచ్‌ఎం చాంద్‌బాషా, వెలుగోడు థెరిస్సా హైస్కూల్ హెచ్‌ఎం అతావుల్లాబాషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మహానంది: రోడ్డు ప్రమాదంలో మహానందికి చెందిన వెంకటరమణ గాయపడ్డాడు. నంద్యాలో చికిత్స పొందుతున్న భార్యను చూసేందుకని శనివారం వెంకటరమణ బైక్‌పై వెళ్తుండగా అల్లినగరం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వెంకటరమణను కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని ఆ పార్టీ శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఇటీవల ఎన్నికల ఫలితాల్లో నిరాశ, నిస్పృహల మధ్య ఉన్నారని, అధైర్య పడొద్దన్నారు. కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, యోగ క్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటానని చెప్పారు. గెలుపు, ఓటములు సర్వ సాధారణమని, ప్రజల తీర్పునకు కట్టుబడి ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పడి కేవలం వంద రోజులైందని, అప్పుడే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. ఈ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయడం లేదని, అందుకే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతవరకు సహనం పాటించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఏ చిన్న కార్యకర్తకు సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, మాజీ అధ్యక్షులు అంజాద్ ఆలీ, నాయకులు వెంకటస్వామిగౌడ్, జె.కృష్ణ, విజయ్, పార్వతి, దర్గమ్మ, షఫీవున్, రవినాయక్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు శిల్పా పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వెలుగోడు/బండిఆత్మకూరు: పలు కారణాలతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం పరామర్శించారు. వెలుగోడు పట్టణానికి చెందిన పాన్ షాప్ మాలిక్ తండ్రి గౌండ బషీర్, అమీర్‌అలీ ఖాన్ తల్లి రహమత్‌బీ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న శిల్పా చక్రపాణి రెడ్డి శనివారం ఆయా కుటుంబాలను పరామర్శించారు. శిల్పా వెంట మండల నాయకులు అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్, ఇలియాస్ ఖాన్, వంగాల నాగేశ్వరరెడ్డి, బోగోలు సుదర్శనం, షంషీర్ అలీ, ఎం.నాగేశ్వర్ రెడ్డి, మధు, రమణ, అచ్చయ్య, శ్రీనివాసులు, శివుడు ఉన్నారు. అలాగే ఏ.కోడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేరెడ్డి అయ్యపురెడ్డి సతీమణి రంగమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం అయ్యపురెడ్డి ఇంటికి వెళ్లి రంగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దేరెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

లేత పైరుకు రసాయన మందులు వాడొద్దు



రైతులకు సూచనలిస్తున్న వ్యయసాయాధికారులు

పాములపాడు: లేత దశలో ఉన్న కంది పైరుపై రసాయన మందులను పిచికారీ చేయొద్దని వ్యవసాయాధికారులు ఫణీశ్వరరెడ్డి, హేమలత రైతులకు సూచించారు. శనివారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద కంది పంటను ఎన్నుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు కంది పైరు పెరుగుదల, చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న పైరులో అంతర పంటగా కంది సాగు చేయడం రైతుకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. పంట మొదటి నుంచే సింథటిక్ పెరియాయిడ్స్ ఐన సైపర్‌మెత్రిన్, ల్యాండ్‌సైహి త్రీన్ వంటి పురుగు మందులు వినియోగించరాదన్నారు. కాయ తొలుచు పురుగు నివారణకు పైరు లేత దశలో వేప నూనె 5 మిల్లీ లీటర్లు, లీటరు నీటిలో, క్లోరాంత్రినిప్రోల్ 0.3మిలీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎండు తెగులు నివారణకు ట్రైకోడర్మ విరిడితో నేల శుద్ధి, విత్తన శుద్ధి చేయాలని సూచించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా!



షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారుడు



పరుగుపందెం నిర్వహిస్తున్న దృశ్యం



పరుగు పందెంలో బాలికలు

కొత్తపల్లి: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు రెండు రోజులుగా ఉత్సాహంగా ఉల్లాసంగా సాగాయి. రెండో రోజు శనివారం పరుగు పందెం, షాట్‌పుట్, జావెలిన్ త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండలం నుంచి నియోజకవర్గ స్థాయికి 120 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ మురళి నాయక్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుంకన్న, స్వప్నశ్రీ, రినాబేగం పాల్గొన్నారు.

- **పాములపాడు:** స్థానిక ఏఎస్‌ఆర్ జెడ్పీహెచ్ స్కూల్‌లో రెండో రోజు ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపిక క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలురు, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించామని, ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని పీడీ, మండల కోఆర్డినేటర్ రాజశేఖర్ తెలిపారు. క్రీడలను వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, సుమలత, శ్రీనివాసులు, సాయిక్రిష్ణ, కళ్యాణీలు లు నిర్వహించారు.

- **గిరిజన విద్యార్థుల ప్రతిభ**

శ్రీశైలంప్రాజెక్ట్: 40 మంది గిరిజన విద్యార్థులు ప్రతిభ చాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం గిరిజన గురుకులు పాఠశాల మైదానంలో క్రీడా జ్యోతిని వెలిగించి ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ డి.వెంకటరమణ, ఎంఈఓ శక్రునాయక్, గురుకుల ప్రతిభా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.జి.కిషోర్‌కుమార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అమృత్ కుమార్, హైస్కూల్ హెచ్‌ఎం ఈశ్వరమ్మబాయి పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల్లో అవకతవకలకు తావివ్వొద్దు

- ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఎం.దాను



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీఓ ఎం. దాసు

జూపాడుబంగ్లా: ఫ్రీ హోల్డ్ భూముల రికార్డుల పరిశీలనలో అవతవకలకు తావివ్వొద్దని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీఓ) ఎం.దాసు సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 2003 కంటే ముందు డీ పట్టాలు పొందిన రైతుల వివరాలను ఆధార్‌తోపాటు సేకరించాలన్నారు. రైతుల వద్ద ఉన్న రికార్డులు నిబంధనలకు లోబడి ఉన్నట్లయితే వారి పేర్లను ఫ్రీ హోల్డ్ భూముల జాబితాలో చేర్చాలన్నారు. మండల పరిధిలో 2,355 రికార్డులకు గానూ 4,461 ఎకరాల భూములను ఫ్రీ హోల్డ్ కింద చేర్చినట్లు వెల్లడించారు. వాటికి సంబంధించిన రైతుల వివరాలను మరోసారి పరిశీలించి 2003 కన్నా ముందు రెవెన్యూ అధికారులు జారీ చేసిన డీ పట్టా, వారి వంశపారంపర్య వివరాలను పొందుపర్చాలన్నారు. సేకరించిన ఆధారాలు సక్రమంగా ఉన్నట్లయితే వారి వివరాలను ఫ్రీ హోల్డ్ భూముల జాబితాలో పొందుపర్చాలన్నారు. ఈనెల 26లోగా రికార్డుల పరిశీలన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్‌లు నాగన్న, చంద్రశేఖర్, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, సర్వేయర్ షహనా పర్వీన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

- మండలంలోని 80 బన్నూరు, రామసముద్రం, కొత్త సిద్దేశ్వరం గ్రామాల్లోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని చెంచు సంఘం నాయకుడు పుల్లన్న, సీపీఐ నాయకులు రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు స్వాములు ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. కొత్తసిద్దేశ్వరం, 80 బన్నూరు గ్రామాల్లోని చెంచులకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని, అలాగే శ్మశాన వాటికలు లేని గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు భూములు కేటాయించాలని కోరారు.

వీధి దీపాల ఏర్పాటు

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్, పార్వతీపురం, దేవస్థానం కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ చలంచలం శిరీష శనివారం తెలిపారు. వీధి దీపాల సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకురావడంతో పరిష్కరించామన్నారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

ఆత్మకూరు: పట్టణంలోని నంద్యాల టర్నింగ్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన వృద్ధురాలు ముర్తూజాబీ(65) ఇంటి నంచి బయటకు వెళ్లి తన బంధు వులతో మాట్లాడి తిరిగి ఇంటి కాలినడకన వస్తుండగా నంద్యాల టర్నింగ్ సమీపంలో లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ముర్తూజాబీ అక్కడికక్కడే మృతిచెందింది. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

పాములపాడు: వీధి కుళాయిలకు ప్రతి రోజు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తామని తుమ్మలూరు సర్పంచు వరప్రసాదరావు తెలిపారు. శనివారం ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు వద్ద ఇన్ లైన్ క్లోరినేషన్ సిస్టంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్స్ పంపిణీ



మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డేమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8 వ తరగతి విద్యార్థులకు కర్నూలు రవీంద్ర టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య ఆర్థిక సహకారంతో ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్స్ ఉచితంగా పంపిణీ చేసినట్లు గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య తెలిపారు. సుబ్బయ్య అందించిన రూ.8 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్స్, నోటుపుస్తకాలు, పెన్నులను శనివారం విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఈశ్వరయ్య తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీరామచంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో కవలలు జననం



కవల పిల్లలతో హాస్పిటల్ సిబ్బంది

మిడుతూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం తెల్లవారు జామున దేవనూరు గ్రామానికి చెందిన జాబీన సుల్తానా కవలలకు జన్మనిచ్చారు. నార్మల్ డెలివరీ చేసిన వైద్య సిబ్బందిని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సియిసుద, నర్సింగ్ ఆఫీసర్ ముర్తుజావలి, సూర్యం , అనురాధ ఉన్నారు.

మూల మలుపు.. ప్రమాదాలకు పిలుపు



ప్రమాదకరంగా ఉన్న మలుపులో ఏపుగా పెరిగిన చెట్లు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు సమీపంలో ఉన్న శాంతినిలయం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న మూల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి పక్కనే ఈ రహదారి మలుపు ఉండటంతో తరచూ ప్రమాలు చోటుచేసుకుంటున్నాయి. అసలే మూలు మలుపు కావడంతోపాటు మొక్కలు ఏపుగా పెరిగి ఉండటంతో అటుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న ఘటనలు చాలానే ఉన్నాయి. యర్రగూడూరు గ్రామానికి చెందిన రైతుల పొలాలు శాంతినిలయం గ్రామ సమీపంలో ఉన్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, రైతు కూలీలు పగలు, రాత్రి వేళల్లో పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం నేషనల్ హైవే రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో మెటీరియల్‌తో భారీ వాహనాల రాకపోకల రద్దీ ఉంటుంది. అటు పొలాలకు వెళ్లే రైతులు ద్విచక్రవాహనాలపై వెళ్లే వారికి మలుపులో దగ్గరికి వచ్చేంత వరకు కనిపించకపోవడం ప్రమాదకరంగా మారింది. ఇప్పటి వరకు చాలా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. స్వల్పగాయాలతో బయటపటడం జరిగింది. పెను ప్రమాదం సంభవించక ముందే సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని మలుపులో ఏపుగా పెరిగిన చెట్లను, పిచ్చి మొక్కలు తొలగించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పందుల స్వైరవిహారం



ఆలయ సమీపంలోని హోటల్ వద్ద సంచరిస్తున్న పందులు

మహానంది: మహానంది ఆలయ పరిసరాల్లో పందులు, గుర్రాలు, గాడిదలు సంచరిస్తూ ఆలయ పవిత్రతకు భంగం కలిగిస్తున్నప్పటికీ అధికారులు, సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మహానంది దేవస్థానం అధికారులు స్పందించి ఆలయ ప్రాంగణంలో పందులు, గుర్రాలు తిరగకుండా తగిన చర్యలు తీసుకుని ఆలయ పవిత్రతను కాపాడాలని భక్తులతోపాటు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కమనీయం..మహానందీశుడి కల్యాణోత్సవం



మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది: గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శనివారం కల్యాణం కనుల పండువగా జరిగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మల ఆధ్వర్యంలో అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్యధారణ, అక్షింతల పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల ద్వారా స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. కాగా ఆంధ్రప్రగతి బ్యాంకు జనరల్ మేనేజర్ హరికేశ్వర ప్రసాద్ స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం డిమాండ్ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యేసురత్నం మాట్లాడుతూ 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ అమౌంట్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు, తిమ్మయ్య, పెద్ద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జెడ్ నాసిర్



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఫారెస్ట్ అధికారులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

బండి ఆత్మకూరు: స్వచ్ఛమైన గాలి, నీరు ఆహారం కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జెడ్ నాసిర్ సూచించారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక అటవీ క్షేత్రాధికారి ప్రాంగణంలో రేంజ్ స్టాఫ్ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్‌నాసిర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనుగడ కోసం ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించాలన్నారు. అందుకు అందరు సహకరించాలని కోరారు.

- **స్వచ్ఛతా హీ సేవపై అవగాహన**

ఆత్మకూరు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అవగాహన కల్పించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రజల ఆరోగ్య జాగ్రత్తలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వచ్ఛతా హీ కార్యక్రమాన్ని పురపాలక సంఘంలో ప్రతిరోజూ కొనసాగించేలా మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఓబులేష్, టీఎంసీ వెంకటేశ్వర్లు, మెప్మా సీఈఓ హుసేన్‌బీ పాల్గొన్నారు.

- **పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి**



తాడిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, గ్రామాల స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు దోహదపడాలని సహకార సొసైటీ సీఈఓ చంద్రశేఖర్ గౌడ్, తాడిపాడు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. శనివారం తాడిపాటు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, పరిసరాలు, గ్రామాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇళ్లల్లోని చెత్తచెదారాన్ని గ్రామాల్లోని వీధుల్లో పారవేయకుండా గ్రీన్ అంబాసిడర్ల ద్వారా డంపుయార్డులకు తరలించాలని సూచించారు. అనంతరం సొసైటీ వద్ద సిబ్బంది మొక్కలు నాటించారు.


- **పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు**



సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మహానంది: స్థానిక దేవస్థానం పారిశుధ్య సిబ్బందికి శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య సిబ్బందికి తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వై.మధు తెలిపారు.

సారా బట్టీలు ధ్వంసం



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సీఐ ఓబులేష్

ఆత్మకూరు: మండలంలోని నల్లమల అటవీ పరిధిలోని డొంగు రస్తాలో నాటుసారా కాస్తున్నట్లు సమాచారం రావడంతో టౌన్ సీఐ ఓబులేష్ తన సిబ్బందితో వెళ్లి శనివారం సోదాలు నిర్వహించి సారా బట్టీలను ధ్వంసం చేశారు. డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను, 20 లీటర్ల నాటుసారాను పారబోశారు. పోలీసులు రాకను గమనించిన తయారీదారులు అక్కడి నుంచి పరారయ్యారు.

దోమల మందు పిచికారీ

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంటలో శనివారం రెండో విడత దోమల మందు పిచికారీ చేశారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి తొట్లలో నిల్వ ఉన్న నీళ్లను పారబోయించి, ప్రజలకు అవగాహన కల్పించారు. రామాలయం, బండ్ల బజార్ తదితర ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవి ప్రకాశ్, సర్వైలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసయ్య పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com